ఇళ్ల వద్దకే సేవలు సీఎం జగన్ ఘనతే

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు
- రూ.1.57 కోట్ల భవనాలు ప్రారంభం


ఎస్ ఇల్లిందలపర్రులో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు


మల్లిపూడిలో వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి


మల్లిపూడిలో గోస్తనీ నదిపై నిర్మించిన వంతెనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్


జుత్తిగలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

పెనుమంట్ర: అన్నిరకాల సేవలను వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు ఇంటివద్దే అందేవిధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లిందలపర్రు, మల్లిపూడి, జుత్తిగ గ్రామాల్లో శ్రీరంగనాథరాజు అధ్యక్షతన రూ.1.57 కోట్లతో నిర్మించిన పలు భవనాలను మంగళవారం ప్రారంభించారు. ఎస్ ఇల్లిందలపర్రులో రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, మల్లిపూడిలో రూ.16 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాన్ని, జుత్తిగలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఎస్ ఇల్లిందలపర్రులో రూ.20 లక్షలతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు, రూ.17 లక్షలతో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్, జుత్తిగలో రూ.17 లక్షలతో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ప్రారంభించారు. మల్లిపూడిలో గోస్తని నదిపై రూ.24 లక్షలతో నిర్మించిన వంతెనను ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ ప్రారంభించారు. కావలిపురం నుంచి మల్లిపూడి వరకు రూ.92 లక్షలతో చేపట్టే తారురోడ్డు నిర్మాణ పనులు శ్రీరంగనాథరాజు ప్రారంభించారు.

హామీలన్నీ అమలు చేశాం

ఈ సందర్భంగా ఎస్ ఇల్లిందలపర్రు సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సభలో శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు గ్రామాల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశామని వివరించారు. విద్య, వైద్యం పేదలకు అందుబాటులో తీసుకొచ్చేందుకు భవనాలు నిర్మించామన్నారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు శంకుస్థాపనలతోనే సరిపెట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ వెలగల వెంకటరమణ, వైస్ ఎంపీపీ ఈది అనిత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు వనుం సూర్యనారాయణ, తమనంపూడి వీర్రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మాంద్రుశాంత వెంకటేష్, దండు రామరాజు, గుడిమెట్ల బాలగంగాధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ గొలుగూరి నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు కొవ్వూరి సూర్యభాస్కరరెడ్డి, దాట్ల చంటిరాజు, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కొవ్వూరి చిన్నారెడ్డి, పెనుగొండ ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు గుడిమెట్ల మురళీ సాయిరెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు బుర్రా రవికుమార్, బీసీసెల్ అధ్యక్షుడు దొంగ దుర్గా ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు పాల్గొన్నారు.

వాలమర్రులో లోవోల్టేజీ సమస్య పరిష్కారం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోపి


వాలమర్రులో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: వాలమర్రు గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. స్థానికులు ఇటీవల వాలమర్రులో లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని కోరడంతో గోపి విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ లైన్, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. దీన్ని గోపీ మంగళవారం ప్రారంభించారు. అనంతరం గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ గంటా సత్యనారాయణ, స్థానిక నాయకులు దాసరి రమేష్, వేంద్ర సింహాచలం, గంటా గణపతిరావు, సరెళ్ల నందీశ్వరరావు, సరెళ్ల పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు, డ్రెయిన్ పనులకు శంకుస్థాపన

పాలకొల్లు 27వ వార్డు బేతేలు ప్రార్థనా మందిరం రోడ్డులో మునిసిపల్ సాధారణ నిధులు రూ.8 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు గుడాల గోపి శంకుస్థాపన చేశారు. వార్డు ఇన్‌చార్జి ఉప్పె పండుబాబు, వార్డు నాయకులు ఎన్‌వీఎస్ మధుసూదనరావు, కలిగితి వరప్రసాద్, సంది బాబి, పొలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమ పూజలు

పోడూరు: కవిటం గ్రామంలో శ్రీ సహస్రచండీ సహిత మహాసౌర పూర్వక చతుర్వేద స్వాహాకార సహిత దశమహావిద్యా పూర్వక అతిరుద్ర మహా యాగ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మూడో రోజు హోమ పూజలు, యాగపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు రుద్రహోమం, అరుణహోమం, చండీహోమం, ఈశ్వరునికి రుద్రపారాయణల అభిషేకం తదితర పూజలు చేశారు. శ్రీ యాజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతి, భారతీయ ధర్మపరిషత్ జాతీయ అధ్యక్షులు కృష్ణచరణానంద భారతీస్వామి పూజల్లో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు యాగ మహోత్సవాల్లో పాల్గొన్నారు. జంధ్యాల శ్రీనివాసశర్మ (నెలమూరు శర్మ), గుడిమెట్ల రామకనకారెడ్డి, సత్తి రామచంద్రారెడ్డి, మేడపాటి రామారెడ్డి, కర్రి రామిరెడ్డి, కర్రి గంగాధరరెడ్డి, బాలాజీరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కవిటంలో రుద్రహోమం నిర్వహిస్తున్న వేదపండితులు


యాగమహోత్సవాలకు విచ్చేసిన కృష్ణచరణానంద భారతీస్వామి

దగ్గులూరులో 320 మందికి వైద్య పరీక్షలు


పాలకొల్లు అర్బన్: దగ్గులూరులో మహిళ ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రతాప్‌కుమార్


మొగల్తూరు : మహిళ ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న డాక్టర్ సుధాకర్

పాలకొల్లు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం అన్నారు. పాలకొల్లు మండలం దగ్గులూరు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కనకభద్రం ప్రారంభించి మాట్లాడారు. జిల్లా ఉపవైద్యాధికారి వరప్రసాద్ శిబిరాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీలో అందించే సేవలను వివరించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు అద్దాల ప్రతాప్‌కుమార్, కిషోర్, జయదుర్గ, గిరీష్ శిబిరంలో పాల్గొన్న 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఇద్దరికి కంటి శస్త్ర చికిత్సల నిమిత్తం ఆరోగ్యశ్రీకి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విశ్వనాథం పేరయ్య, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రావి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ సప్పరపు కోటేశ్వరరావు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పంచాయతీ కార్యదర్శి ఎస్ఎస్ మల్లేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను వినియోగించుకోండి

మొగల్తూరు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ కవురు సావిత్రి సూచించారు. మంగళవారం మొగల్తూరు మండలం కాళీపట్నం పడమర గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరంలో సుమారు 291 మందికి వైద్యులు ఓ.దినేష్, జేఈఎస్ గణేష్ బాబు, ఎం విజయలక్ష్మి, టి.వాసు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన మందులను అందజేశారు. వీరిలో 52 మందికి కళ్లజోళ్లు, ఇద్దరికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినట్టు డాక్టర్ సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కవురు సీతా మహలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కవురు ఆదినారాయణ, జక్కంశెట్టి ఏడుకొండలు, సొసైటీ చైర్మన్ దొంగ నాగముని, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల

యలమంచిలి: ఈ నెల నాలుగో తేదీన 10, 5వ తరగతుల విద్యార్థులకు నిర్వహించిన యూటీఎఫ్ టాలెంట్ టెస్ట్ ఫలితాలను మంగళవారం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్ విడుదల చేశారు. 10వ తరగతి తెలుగు మీడియంలో ఏనుగువానిలంక హైస్కూల్ విద్యార్థిని రాయి మౌనిక, ఇంగ్లిష్ మీడియంలో మట్లపాలెం పేరిచర్ల సుబ్బరాజు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని గుబ్బల మీనాక్షి ఓవరాల్ ఫస్ట్ సాధించారని చెప్పారు. రాష్ట్రంలో మొదటిసారిగా యలమంచిలి మండలంలో ఈ పరీక్షలను ప్రారంభించి 27 సంవత్సరాలుగా నిరాటంకంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పరీక్షల విజేతలకు క్రాంతికుమార్ అభినందనలు తెలిపారు. త్వరలోనే విజేతలకు బహుమతులు అందజేస్తామని సంఘ మండల ప్రధాన కార్యదర్శి పంతం రామ్మూర్తినాయుడు చెప్పారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు, ముద్దల బాపిరాజు, గొర్రెల మాధవి, కేతా అబ్బులు, కుడుపూడి సతయనారాయణ, జవ్వాది నాగేశ్వరరావు పాల్గొన్నారు.


మేడపాడులో యూటీఎఫ్ టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల చేస్తున్న నాయకులు

డ్వాక్రా మహిళలు, సీఏలకు సత్కారం

పెనుగొండ: తూర్పుపాలెంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు నిర్వహించిన ఆసరా సంబరాలు విజయంతానికి చేసిన కృషి అభినందనీయమని పెనుగొండ సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అన్నారు. మంగళవారం ఇలపర్రులో డ్వాక్రా మహిళలు, సీఏలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మనాగేశ్వరి మధు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు వేండ్ర వెంకటేశ్వర్లు, వేగిరాజు శ్రీనివాస రాజు, సాదే గోపాలం, కటికతల మోహనరావు, శీలం లక్ష్మి, గూనపాటి సంజీవరావులు పాల్గొన్నారు.


డ్వాక్రా మహిళలను సత్కరిస్తున్న సర్పంచ్ పద్మావతి

సొంతింటి కల నెరవేర్చుతున్న జగనన్న


ఏనుగువానిలంకలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ ధనలక్ష్మి

యలమంచిలి: పేదల సొంతింటి కల నెరవేర్చే బాధ్యత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారని ఏనుగువానిలంక ఎంపీటీసీ సభ్యురాలు వినుకొండ ధనలక్ష్మి అన్నారు. ఏనుగువానిలంక గ్రామానికి చెందిన 12 మందికి మంజూరైన ఇళ్ల స్థల పట్టాలను స్థానిక సచివాలయంలో సర్పంచ్ ఈద ప్రమీలతో కలిసి మంగళవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ముందే మౌలిక వసతులు కల్పిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. ప్రతి కాలనీలోనూ ఇప్పటికే రోడ్లు, విద్యుత్, తాగునీరు వసతి కల్పించినట్టు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని ఆమె లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వినుకొండ రవికుమార్, మేకం రామాంజనేయులు, బళ్ల నాగేశ్వరరావు, ఉల్లంపర్తి జాన్, మల్లుల కొండ, పాలపర్తి ఇమ్మానుయేలు, గ్రామ కార్యదర్శి అడబాల కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖాధికారి సంజీవ్‌కుమార్

పెనుగొండ: ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలకు నివారణతోపాటు ప్రాణాలకు భరోసా ఉంటుందని తణుకు సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వై.సంజీవ కుమార్ అన్నారు. రోడ్ సేఫ్టీ మాసోత్సవాలు సందర్భంగా మంగళవారం పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల, విశ్వతేజ డిగ్రీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్, రవాణాశాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. అధిక స్పీడు, అవగాహన లేని డ్రైవింగ్, ఈగో ఫీలింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్ మాట్లాడడం వంటి వాటి వల్ల ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. వీటిని తగ్గించుకోవాలని సంజీవకుమార్ సూచించారు. కార్యక్రమంలో ఎస్వీకేపీ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, సీనియర్ డ్రైనింగ్ డైరెక్టరు ఎంవాసు, జమ్మయ్య, విశ్వతేజ ప్రిన్సిపాల్ పులిదిండి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారులు టి.దివాకర్, ఆర్ఎన్ శ్రీనివాస్, పి.మీరయ్య, మహేష్‌లు పాల్గొన్నారు.

ల్యాబ్ నిర్వాహకుల వినతి


వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోపికి వినతిపత్రం అందిస్తున్న ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులు

పాలకొల్లు అర్బన్: ల్యాబ్ నిర్వాహకుల సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం క్షీరపురి ల్యాబ్ టెక్నీషియన్స్ ఆధ్వర్యంలో గుడాల గోపికి వినతిపత్రం అందజేశారు. ల్యాబ్ నిర్వాహకులు ఎండీ పైథాలజిస్టు పర్యవేక్షణలో ల్యాబ్‌లను నడపాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ జీఓ జారీ చేసిందని, ఇది బేసిక్ ల్యాబ్ నిర్వాహకులకు సాధ్యం కాదని తెలిపారు. గోపిని కలిసిన వారిలో సంఘ అధ్యక్షుడు టీహెచ్‌పీఎల్ నారాయణ, కార్యదర్శి పి.రవికుమార్, కన్వీనర్ షేక్ సయ్యద్ బాజీ, ఉపాధ్యక్షుడు జి శ్రీనివాసరావు, జుత్తిగ ప్రసాద్, ల్యాబ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు గాంధీనగర్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

నరసాపురం: స్థానిక గాంధీనగర్ సచివాలయం వద్ద బుధవారం ఉదయం 9.30 గంటలకు 16, 17వ వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయా వార్డుల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో సరస్వతి పూజ


సరస్వతి పూజ చేస్తున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతిదేవి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ అమ్మవారి కరుణా కటాక్షాలతో విద్యార్థులందరూ ఉత్తమ విద్యనభ్యశించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వసంత పంచమి సందర్భంగా గీతామందిరం గురువులు స్వామీ రామానందగిరి మహరాజ్ ఆధ్వర్యంలో కళాశాలలో సరస్వతి పూజ చేశామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షుడు గాదె వెంకన్న, శీరం ఆనందకృష్ణ, కేవీఎల్ నరసింహ రాజు, చెరుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు పెనుమంట్రలో రోడ్లు, డ్రెయిన్ల ప్రారంభం


ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు


పెనుమంట్ర: పెనుమంట్ర 1, 2 సచివాలయ పరిధిలోని బ్రాహ్మణ చెరువు ఇందిరమ్మ కాలనీ, పెనుమంట్ర దళిత కాలనీలో రూ.91 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు బుధవారం ఉదయం ప్రారంభిస్తారని గ్రామ సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు తెలిపారు. రాజీవ్‌కాలనీలో రూ.15 లక్షలతో చేపట్టే ఎస్సీ కమ్యూనిటీహాలు, రూ.10లక్షలతో చేపట్టే బీసీ కమ్యూనిటీ హాలు భవన నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

సరోజినీ నాయుడుకు నివాళి


సరోజినీ నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: భారత గాన కోకిలగా పేరు గాంచిన సరోజినీ నాయుడు జయంతిని మంగళవారం నరసాపురం మండలం వేములదీవి గొందిమూల మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయిని రాజశ్రీ సరోజినీ నాయుడు జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. సరోజినీ నాయుడు జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మహిళాభివృద్ధికి సరోజినీ నాయుడు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆమె రాసిన రచనలు, కవితలు, ఉపన్యాసాలగురించి రాజశ్రీ వివరించారు.

నైపుణ్యాభివృద్ధితో మెరుగైన విద్యాబోధన


నైపుణ్యాభివృద్ధిపై వివరిస్తున్న మధుభూషణరావు

భీమవరం: నైపుణ్యాభివృద్ధితో విద్యాబోధనలో నాణ్యత పెరుగుతుందని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సి.మధుభూషణరావు అన్నారు. భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓపెన్ డే, ఉద్యోగ మేళా కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భీమవరం మండలంలోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులను డిగ్రీ కళాశాలలకు తీసుకువచ్చి కళాశాలలోని మౌలిక సదుపాయాలను చూపించి డిగ్రీలో చేరాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన మాట్లాడుతూ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 14 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకాంతం, అధ్యాపకులు పి.అరవింద్‌స్వామి, కాకుమాని శ్రీనివాసరావు, ఎస్‌డీవీ సత్యనారాయణ, ఎల్.నర్సింహరావు పాల్గొన్నారు.

15న పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు

భీమవరం: గ్రూప్స్, డీఎస్సీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు యూటీఎఫ్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 15వ తేదీన భీమవరంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ ఒక ప్రకటనలో తెలిపింది. భీమవరంలోని చింతలపాటి బాపిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో విద్యావేత్త, పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు పాల్గొననున్నారు. సదస్సు అనంతరం ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేయనున్నారు.

ఇసుక ర్యాంపులను పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి


సిద్ధాంతం ఇసుక ర్యాంపులో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పెనుగొండ: సిద్ధాంతం, నడిపూడి, కరుగోరుమిల్లి గ్రామాల్లోని ఓపెన్ ఇసుక ర్యాంపులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం పరిశీలించారు. రెండు మండలాల్లోని ఆరు ఇసుక ర్యాంపులను పునః ప్రారంభించడానికి పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు చేశామని ఆమె చెప్పారు. అనుమతులు రాగానే వీటిని ప్రారంభిస్తామన్నారు. అనుమతులు ఇచ్చే లోపులో తవ్వకాలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏఎస్పీ ఏటీవీ కుమార్, ఆర్డీఓ ఎం అచ్యుత అంబరీష్, జలవనరుల శాఖ శ్యాం ప్రసాదు, కాలుష్య నియంత్ర మండలి ఈఈ కె.వెంకటేశ్వరరావు, గోదావరి కన్సర్వేటరు ఆర్ కాశీ విశ్వేశ్వరరావు, ఇన్‌చార్జి తహసీల్దారు వి.అన్నపూర్ణ, డి సుగుణ సంధ్య, అధికారులు పాల్గొన్నారు.

నేడు జగనన్నతో జనం - గోపన్నతో మనం

పాలకొల్లు అర్బన్: స్థానిక 10వ వార్డు లక్ష్మీనగర్‌లో బుధవారం ఉదయం 6.15 గంటలకు జగనన్నతో జనం – గోపన్నతో మనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు పార్టీ పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి నవరత్నాల పథకాలను వివరిస్తామని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని కోరారు.

